ప్రజాశక్తి
మంగళవారం 11 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

ఆరోగ్య సేవలపై ఐటిడిఎలో కంట్రోల్‌రూం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు వైద్య ఆరోగ్య సేవలకు ఎలాంటి సమస్యనైనా ఫిర్యాదు చేయడానికి ఐటిడిఎ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏ గిరిజన గ్రామంలోనైనా అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందడానికి, గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణులు ప్రసవ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడానికి కంట్రోల్ రూం సూచనలు చేస్తుందని చెప్పారు. వైద్య సేవలపై సలహాలు పొందడానికి కంట్రోల్ రూం నెంబర్ 9491472982కి ఫోన్ చేయాలని కోరారు.

వరహాలగెడ్డ భూమి విక్రయం

- అమ్మకందారు వ్యాపారి కొత్తకోట ప్రసాద్
- కొనుగోలుదారు లక్ష్మీ షాపింగ్ మాల్ యజమాని
- అధికార పార్టీ కీలక నేత అండతో భూబాగోతం
- నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణ నడిబొడ్డున ఉన్న వరహాల గెడ్డ ప్రభుత్వ భూమిని దర్జాగా అమ్మేశారు. విశాఖపట్నానికి చెందిన లక్ష్మీ షాపింగ్ మాల్ యజమాని కొనుగోలు చేశారు. కొద్దిరోజుల క్రితం ఈ భూమి అమ్మకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పూర్తయింది. సర్వే నెంబర్ 410లో ఉన్న వరహాలగెడ్డ ప్రభుత్వ భూమి 7 సెంట్లను పట్టణానికి చెందిన వ్యాపారి కొత్తకోట ప్రసాద్ అమ్మేశారు. ఈ ప్రభుత్వ భూమి పక్కనే 411-9లో ఉన్న ఆయన జిరాయతీ భూమితో కలిపి రిజిస్ట్రేషన్ చేయించారు. 2022లో ఈ భూమిపై కన్నేసిన వ్యాపారి కొత్తకోట ప్రసాద్ వరహాల గెడ్డను తన భూమిగా చూపిస్తూ ఆ స్థలంలో బోర్డు కూడా పెట్టించారు. దీనిపై అప్పటి తహశీల్దార్ ఎన్‌వి రమణకు పట్టణానికి చెందిన నాయకుడు సురగాల ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వరహాల గెడ్డ భూమిని సర్వే చేసిన అధికారులు అది ప్రయివేటు భూమి కాదని, ప్రభుత్వ భూమి అని నిర్ధారించారు. ప్రభుత్వ భూమిని ప్రయివేటు భూమిగా చూపిస్తూ ఆ స్థలంలో నోటీసు బోర్డు పెట్టడాన్ని తీవ్రంగా పరిగణించిన తహశీల్దార్ ఎన్‌వి రమణ

వరహాలగెడ్డ స్థలంలో ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు

ఆక్రమణదారులపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ కింద కేసు నమోదైంది. తర్వాత ప్రభుత్వ భూమిలో హెచ్చరిక నోటీసు బోర్డు పెట్టించారు. ఈ బోర్డు ఇప్పటికీ ఆ స్థలంలో ఉన్నప్పటికీ అమ్మేయడం వెనుక అధికారపార్టీకి చెందిన నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నాయనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆ ప్రజాప్రతినిధి అండతోనే వ్యాపారి కొత్తకోట ప్రసాద్ ప్రభుత్వ భూమిని దర్జాగా విక్రయించారనే ప్రచారం సాగుతోంది.

రూ.కోట్ల విలువ చేసే గెడ్డ పోరంబోకు భూమిని విక్రయించడంలో అటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించారు. ఈ భూబాగోతంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయనే చర్చ నడుస్తోంది. పట్టణంలో భూకబ్జాదారుల అంతు చూస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఇప్పుడు ప్రభుత్వ భూముల ఆక్రమణ,

అమ్మకాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశమవుతున్నాయి.

నిద్రావస్థలో రెవెన్యూ ఉన్నతాధికారులు

పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. భూకబ్జాలపై ఫిర్యాదులు అందుతున్నా కనీసం స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కోట్లాది రూపాయల విలువైన వరహాల గెడ్డ ప్రభుత్వ భూమిని దర్జాగా రిజిస్ట్రేషన్ చేయించినా సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. సామాన్యులు ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే ఆగుమేఘాలపై విచారణ జరిపి చర్యలు తీసుకునే రెవెన్యూ అధికారులు.. పెత్తందార్ల అండతో సాగుతున్న భూబాగోతాలపై మౌనం వహిస్తున్నారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

మరో చెరువు కబ్జాకు స్కెచ్

పట్టణంలో మరో చెరువు కబ్జా చేయడానికి రంగం సిద్ధమైంది. అధికారపార్టీ నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధి అండతో పట్టణ నాయకులు ఈ చెరువును జెసిబితో కప్పేందుకు యత్నించారు. అయితే ఆయకట్టు రైతులు నిలదీయడంతో చదును చేసే ప్రక్రియ నిలిచిపోయింది. పట్టణ నడిబొడ్డున కొత్తవలస రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ చెరువు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనిని ఆక్రమించి లేఅవుట్ వేసి విశాఖపట్నం వ్యక్తులకు విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ చెరువుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్లు తెలుస్తోంది. కొద్ది నెలల క్రితం జిల్లా నుంచి బదిలీపై వెళ్ళిన ఓ రెవెన్యూ ఉన్నతాధికారి చెరువుకు చెందిన రికార్డు ట్యాంటరింగ్ చేసి బదిలీపై వెళ్ళినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఆ అధికారి లక్షలాది రూపాయల ముడుపులు తీసుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ట్యాంపరింగ్ చేసిన ఈ చెరువుకి సంబంధించిన సర్వే నెంబర్‌ని ఆన్ లైన్ చేయాలని అధికారపార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆన్‌లైన్ చేయడానికి తిరస్కరించిన తహశీల్దార్ ఇప్పటికే బదిలీపై వెళ్లిపోయారు.

నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌కి

నిబంధనలు వర్తించవా?

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌కు నిబంధనలు వర్తించవా? అని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు. పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఆర్‌టిసి స్థలంలో చేపడుతున్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్మాణాన్ని సిపిఎం బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ ఇటీవల పార్వతీపురం జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలకు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్నారు. జిల్లా అధికార యంత్రాంగమంతా ఉన్నచోటే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నా రంటే.., అధికారులు ఎంత అచేతనంగా ఉన్నారో అర్థమవుతుందని విమర్శించారు. సుమారు రూ.50 కోట్ల విలువైన 5,500 గజాల ఆర్‌టిసి స్థలాన్ని కేవలం ఏడాదికి రూ.1.20 లక్షల లీజుకు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. దీని వెనక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రజాధనాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వ అధికారులే ఈ రకంగా కార్పొరేటర్ సంస్థలకు ప్రభుత్వ ఆస్తులను దోచిపెడుతుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భవన నిర్మాణాలు చేపట్టినప్పుడు ప్రాథమికంగా ఖాళీ స్థలం పన్ను మున్సిపాలిటీకి చెల్లించి, టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ప్లాన్ అప్రూవల్ తీసుకున్న తర్వాత నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని గుర్తుచేశారు. ఎలాంటి నిబంధనలూ పాటించకుండా పార్వతీపురం నడిబొడ్డున సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్మాణం చేపడుతున్నారని, ఇది ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించ రాని నేరమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుమారు పార్వతీపురం మున్సిపాలిటీకి పది లక్షల రూపాయల ఆదాయానికి ఈ వ్యవహారంలో గండి పడిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షాపింగ్ మాల్స్‌లో ప్రమాదాలు జరిగితే దానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై విచారణ జరిపించి మున్సిపల్ నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని, అతి తక్కువ లీజుకు ప్రభుత్వ స్థలాన్ని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్మాణానికి ఇవ్వడం పట్ల విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, జిల్లా నాయకులు కె.రామస్వామి, బి.వి.రమణ, పట్టణ నాయకులు, పి.సన్యాసిరావు, ఎస్.ఉమామహేశ్వరరావు, ఆర్.శ్రీదేవి, బి.లక్ష్మి, జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైసిపి నాయకులు

ప్రభుత్వ వైద్యం పేదల హక్కు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ప్రభుత్వ వైద్య సేవలు పొందడం పేద ప్రజల హక్కని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. సోమవారం తన నివాసంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపడుతున్న ప్రజా ఉద్యమం వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 17 వైద్య కళాశాలలను రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. వాటిని టిడిపి కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో ప్రయివేటీకరణ చేయడానికి సన్నాహాలు చేస్తోందని చెప్పారు. దీని వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షలా మారుతుందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు తన రాజకీయ ప్రస్థానంలో ఇంతవరకు ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలనీ తీసుకు రాలేదని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడాన్ని రాష్ట్రంలో అనేకమంది వైద్య నిపుణులు, విశ్లేషకులు తప్పు పడుతున్నారని చెప్పారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని రాజన్నదొర కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరి రఘు, సీనియర్ నాయకులు గొర్లి మాధవరావు, కాకి పాండురంగ, కొల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

సత్వర పరిష్కారమే లక్ష్యం

అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి • అధికారులకు కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సాధ్యమైనంత వరకు వెనువెంటనే సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంతో అర్జీదారులు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు పునరావృతం కాకూడదని అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పిజిఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు మొత్తం దరఖాస్తులు 99 అందాయి.

అర్జీల్లో కొన్ని...

వీరఘట్టం మండలం సంతనర్సింగపురం నుండి సాధువాసు నాయుడు తన తండ్రి అకాల మరణం చెందారని, తన తండ్రి భూములు జీరో విస్తీర్ణంలో ఉందని, ఆ భూములను జీరో క్లియర్ చేయాలని విన్నవించారు.

కురుపాం మండలం గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూర గ్రామానికి చెందిన రైతులు, మహిళలు ఇందిరా కాలనీ నుంచి పెల్లిమెట్టు వరకూ, రైతు లంక పొలంధార వరకు గ్రావెల్ మట్టిరోడ్లు, చిట్టి గెడ మీదుగా పెల్లిమెట్టు వరకు రోడ్డు కావాలని కోరుతూ దరఖాస్తు చేశారు.

పిజిఆర్ఎస్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

1999లో సర్వే నంబరు 226-1, 226-1సి, 226-1బిలో 98 సెంట్ల మెట్ట భూమిని ఆలవిల్లి శేషమ్మ నుండి కొనుగోలు చేసి, సాగు చేస్తూ ఫలసాయాన్ని అనుభవిస్తున్నానని, అప్పట్లో రెవెన్యూ శాఖ పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేసినా, ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా కనిపిస్తోందని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని కురుపాం మండలం గుమ్మిడిగూడ పంచాయతీ గోళ్లవలస నుండి శెట్టి శ్రీనివాసరావు వినతి అందించారు.

భామిని మండలం మనుమకొండ గ్రామం నుండి నిమ్మల అన్నయ్య తాము 42 మంది గిరిజన సవర కులానికి చెందిన వాళ్లమని, 18-20 సంవత్సరాల నుండి సర్వే నెంబరు 57-1లో 14.96 ఎకరాలను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అదే సర్వే నెంబరులో జిరాయతీ భూమిని 4.20 ఎకరాలను మిగిలిన వాళ్ల వేరే రైతులకు అమ్మివేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కి విన్నవించుకున్నా నేటికీ పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయలేదని తెలిపారు. పాసుపుస్తకాలను మంజూరు చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.

మక్కువ మండలం శంబర గ్రామం నుంచి చిప్పాడ నారాయణమ్మ తనకు వేలిముద్ర, ఐరిష్ పడనందున నవంబర్ నెల పెన్షన్ రాలేదని, ఫొటో తీసుకుని పింఛను ఇప్పించాలని వినతి అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆ గ్రామస్తులు పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి అందించారు. రోడ్లు బాగాలేవని తమ గ్రామానికి బస్సు సౌకర్యం నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రోడ్లు బాగానే ఉన్నాయని, బస్సు సర్వీసు నడపాలని కోరారు. కార్యక్రమంలో పెద్దబుడ్డిడి మాజీ ఎంపిటిసి సీమల బాబు, భువన మోహనరావు, పిఎసిఎస్ మాజీ ఉపాధ్యక్షులు బలిమి వెంకటరమణ, రెడ్డి తవిటినాయుడు, ఎస్ఎంసి చైర్మన్ కర్రి నారాయణ నాయుడు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు

పార్వతీపురం టౌన్ : నిబంధనలను ఉల్లంఘిస్తూ 2026-27 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవి కుమార్, నాయకులు వికాస్, బుజ్జి, చరణ్, నాని పాల్గొన్నారు.

రుణాల మంజూరులో రాజకీయ జోక్యం నివారించాలని వినతి

పార్వతీపురం : పాచిపెంట మండలం మోసూరు గ్రామానికి చెందిన శ్రీవరలక్ష్మి మహిళా పొదుపు సంఘం సభ్యులకు రుణాల మంజూరు చేయడంలో ఇబ్బందులకు గురిచేస్తున్న వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే రుణాలు మంజూరు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శ్రీదేవి, బి.లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో మోసూరు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసూరు మహిళలు ఇప్పటికే రెండు దఫాలుగా కలెక్టర్ కార్యాలయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై, రుణాలు మంజూరులో జరుగుతున్న జాప్యంపై ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందనా లేదని చెప్పారు. అక్కడి రాజకీయ నాయకులు, వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులు కలిసి డ్వాక్రా మహిళలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. వీరు ఇప్పటికే గతంలో తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించారని, అలాంటి వారికి మళ్లీ రుణాలు మంజూరు చేయడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా వరలక్ష్మి పొదుపు సంఘం సభ్యులకు డ్వాక్రా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మహిళలతో ఐద్వా ఆధ్వర్యాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి మహిళా పొదుపు సంఘం సభ్యులు జి.ఈశ్వరమ్మ, టి.పార్వతి, ఎన్.భవాని, జి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జిసిసి సంతలో ఏర్పాటుచేసిన వస్తువులను పరిశీలిస్తున్న జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి

జిసిసి ద్వారా నాణ్యమైన వస్తు విక్రయం

జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో జిసిసి ద్వారా నాణ్యమైన వస్తువులను విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. జన్ జాతీయ గౌరవ దినోత్సవం వేడుకలలో భాగంగా సోమవారం పార్వతీపురం గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గిరిజన సంతను జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించిన పంటను జిసిసి ద్వారా కొనుగోలు చేస్తామని అన్నారు. కొనుగోలు చేసిన వస్తువులను జిసిసి ద్వారా విక్రయిస్తున్నట్లు చెప్పారు. గిరిజనుల వద్ద నాణ్యమైన వస్తువులు లభిస్తాయని, ప్రతిఒక్కరూ జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేయడం వల్ల వారికి సరైన ధర లభించేలా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. బయట కొనుగోలు చేసే వస్తువులకు, జిసిసి ద్వారా కొనుగోలు చేసిన వస్తువులను పోల్చి చూసుకోవాలని సూచించారు.

అటవీ ఉత్పత్తులను సేకరించే సరైన పద్ధతులు, నాణ్యత ప్రమాణాలు, సరుకులలో నకిలీవి, మంచివి గుర్తించే విధానంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దళారుల నుంచి గిరిజనులు మోసపోకుండా రక్షించడమే ఈ గిరిజన సంత ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జెసి సందర్శించారు. స్థానికులు సంతలో కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు అధికారి మురళీధర్, జిసిసి డివిజన్ మేనేజర్ జె.రామారావు, పార్వతీపురం జిసిసి మేనేజర్ ఎం.సాంబశివరావు, జివిఎల్‌పురం మేనేజర్ ఎస్.రాము, సాలూరు మేనేజర్ సిహెచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కొండబారిడి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కూలే సమయంలో ఆ దారిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారికి అడ్డంగా చెట్టు పడి ఉండడంతో మొండెంఖల్లు, నీలకంఠాపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం తదితర గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, వాహనదారులు కాసేపు ఇబ్బంది పడ్డారు. స్థానికులు అధికారులకు సమాచారం తెలియజేయడంతో పోలీసులు, ఆర్‌అండ్‌బి అధికారులు, సమీప గ్రామస్తులు కలిసి రహదారికి అడ్డంగా పడిన చెట్టును తొలగించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రహదారికి అడ్డంగా పడిన భారీ వృక్షం

అధ్వానంగా దోకులగూడ రహదారి

ప్రజాశక్తి-సీతంపేట

భామిని మండలం నల్లరాయిగూడ పంచాయతీ ఇసకగూడ నుంచి దోకులుగూడకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రహదారి మంజూరై నాలుగేళ్లు కావస్తున్నా నిర్మాణం చేపట్టడం లేదు. ఈ సమస్యపై గిరిజన సంక్షేమ శాఖకు, ఇఇలకు వినతులు అందించినా ఫలితం లేదని సిపిఎం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 15 రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అధ్వానంగా తయారైన దోకులగూడ రహదారి ఇదే

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 54 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 54 అర్జీలు అందాయి. ఐటిడిఎ పరిధిలో మండలాల నుంచి గిరిజనులు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ఐటిడిఎ ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ జి.రామ్మోహన్ రావు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వినతుల్లో కొన్ని..

సీతంపేట మండలం చిన్నరామ గ్రామానికి చెందిన బిడ్డిక శ్రీరాములు అన్నదాత సుఖీభవ డబ్బులు ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు.

పాతపట్నం మండలం గులిమిసింగిగూడ గ్రామానికి చెందిన సరస్వతి హౌసింగ్ కోసం పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు.

సారవకోట మండలం సింగంవలస గ్రామానికి చెందిన బొమ్మాళి జయలక్ష్మి మేకల కోసం రుణం మంజూరు చేయాలని విన్నవించారు.

కొత్తూరు మండలం కోతంగూడ గ్రామానికి చెందిన సవర సురేష్ సిసి రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు.

వినతులు స్వీకరిస్తున్న ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు

సీతంపేట మండలం మోహన్ కాలనీ గ్రామానికి చెందిన సవర సరస్వతి కుట్టుమిషన్ మంజూరు చేయాలని కోరారు.

కొత్తూరు మండలం ఇరపాడుగూడ గ్రామానికి చెందిన సవర ఫాల్గుణరావు పంచాయతీ, కమ్యూనిటీ, అంగన్వాడీ భవనాలు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.

సీతంపేట మండలం ఈతమానుగూడ గ్రామానికి చెందిన సవర కూర్మారావు నాటు కోళ్ల షెడ్డు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు.

మందస మండలం పద్మాపురం కాలనీకి చెందిన సవర జ్యోతి తమ గ్రామంలో నాలుగు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయని, ఆర్థిక సహాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు.

సారవకోట మండలం మహాసింగి గ్రామానికి చెందిన కె.ఆదినారాయణ కూరగాయలు అమ్ముకొనుటకు టివిఎస్ వాహనం మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు.

భామిని మండలం చింతలగూడ గ్రామానికి చెందిన బుజ్జిబాబు కోర్టు కొట్టి వేసిన ఫారెస్ట్ కేసుపై ఫారెస్ట్ అధికారులు మరల అప్పీలు చేసుకొనుటకు కోర్టుకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీది గ్రామానికి చెందిన దశమయ్య చేప పిల్లలు పంపిణీ చేయాలని వినతి పత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, డిపిఎం రమణ, సూపరింటెండెంట్ అప్పారావు, డిఇ నాగభూషన్, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డిఇ రాధారాణి, ఇతర అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా దిలీప్

ప్రజాశక్తి-సాలూరు

జర్జాపు దిలీప్

రాష్ట్ర నాగవంశం వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జనసేన నాయకులు జర్జాపు దిలీప్‌ని నియమించారు. దిలీప్ భార్య దీప్తి ఇప్పటికే మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. కొద్దినెలల క్రితం వైసిపి నాయకత్వంపై అసంతృప్తితో సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు జనసేనలో చేరారు. దిలీప్‌ను రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై పట్టణానికి చెందిన జనసేన కౌన్సిలర్లు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీలకు సీతంపేట విద్యార్థి

ప్రజాశక్తి-సీతంపేట

జాతీయ స్థాయి పోటీలకు సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సవర కావ్య ఎంపికైంది. ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి డిస్కస్‌త్రో సత్తాచాటి, జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో కావ్యను హెచ్ఎం వసంత లక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, పీడీ శైలజ, ఉపాధ్యాయులు అభినందించారు.

కావ్యను అభినందిస్తున్న హెచ్ఎం, హెచ్ డబ్ల్యుఒ, పీడీ

సురక్షిత ప్రసవమే లక్ష్యం

ప్రజాశక్తి-పార్వతీపురం

సురక్షిత ప్రసవమే లక్ష్యంగా గర్భిణులకు వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు మాత, శిశు ఆరోగ్యంపై సమీక్షా సమావేశాన్ని ఆరోగ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. గర్భిణులకు నిర్దేశించిన ప్రతీ ఆరోగ్య కార్యక్రమాన్ని పక్కగా అమలు చేసి, మెరుగైన వైద్య సేవలు అందేలా క్షేత్ర స్థాయిలో వైద్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పిహెచ్‌సిలలో ప్రసవాలు మెరుగు పడేందుకు కార్యాచరణ చేయాలన్నారు. గర్భిణీ నమోదు నుండి ప్రసవానంతర వరకు అన్ని పరీక్షలు చేపట్టి పర్యవేక్షించాలన్నారు. గతంలో జిఎన్ పేట పిహెచ్‌సి పరిధికి చెందిన గర్భిణీ మృతికి గల కారణాలపై సమీక్షించారు. అందరూ సమన్వయంతో పని చేస్తూ గర్భిణీ ఆరోగ్య శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ నాగభూషణరావు, డిఐఒ విజయ్ మోహన్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు పద్మావతి, విజయ పార్వతి, సూపరింటెండెంట్ నాగశివజ్యోతి, గైనకాలజిస్టులు, ప్రోగ్రాం ఆఫీసర్స్ రఘు, కౌశిక్, ఇన్‌ఛార్జి డిపిహెచ్ఎన్ ఒ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు సి.పి. బ్రౌన్

కలెక్టర్ ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

తెలుగు భాషకు శాస్త్రీయ పునాది వేసిన దార్శనికుడు సి.పి.బ్రౌన్ అని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి కొనియాడారు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 227వ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తోపాటు జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి కలిసి సి.పి.బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషా పరిశోధన, గ్రంథ పరిష్కరణకు సుస్థిరమైన మార్గం వేసిన మహనీయుడు సిపి బ్రౌన్ అన్నారు. సిపి బ్రౌన్‌ను ఆదర్శంగా తీసుకుని అందరూ తెలుగులో సంతకం పెట్టి భాష ఔన్నత్యాన్ని చాటి చెబుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కవి అందెశ్రీ మృతిపై విచారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రముఖ కవి అందెశ్రీ మరణించడం చాలా బాధాకరమని రచయిత పాలక దేవానంద్ అన్నారు. అందెశ్రీ రాసిన జయ జయహే, తెలంగాణ, మాయమై పోతున్నడమ్మ.. అనే పాటలను ఒక వేదికపై తనతో పాడించడం, భుజంపై చేయి వేసి అభినందించడం మరచి పోలేని సంఘటనలని పేర్కొన్నారు. ఆయనతో తనకున్న అనుబంధం మరువలేనిదని చెప్పారు. అందెశ్రీ మరణించడం సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

దుగ్గేరులో ఆర్గానిక్ బయో ఇన్‌పుట్ సెంటర్

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని పనసభద్ర పంచాయతీ దుగ్గేరు గ్రామంలో సోమవారం వ్యవసాయ బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్‌ను మండల వ్యవసాయాధికారి సిహెచ్ భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ సహజ సిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులనే తిందామని, ఆరోగ్యాన్ని కాపాడుకుందామని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రతిఒక్కరూ చెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సేదరపు లక్ష్మి, ఎఇఒ వెన్నెల, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి ఉర్లక నాగార్జున, షాపు యజమాని దీసరి వెంకటరావు పాల్గొన్నారు.

'నీట్' అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్..సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ సోమవారం మెటీరియల్‌ను ప్రిన్సిపల్ వి. రామలక్ష్మి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మెటీరియల్ అందించిన ఎస్ సొసైటీకి విద్యార్థులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-సీతానగరం

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పిఎంఎస్ఎంఎ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం ఇస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యుడిసి మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణరావు కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని బిసి కాలనీ వీధికి చెందిన డాకారపు నారాయణ రావు కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట జలుమూరు అమర్నాథ్, బొమ్మల బాబూరావు, శంభాన శ్రీనివాసరావు, కానపాక సూర్యప్రకాష్, పాలవలస ధవలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మక్కువ మండల సమావేశం

ప్రజాశక్తి-మక్కువ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎన్.అర్జునరావు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2026-27కు సంబంధించి సాధారణ బడ్జెట్ సమావేశం కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు పట్టణంలోని బంగారమ్మపేటకు చెందిన దేవిపల్లి వెంకటరావు ఇంట్లో బంగారం, నగదు చోరీ అయ్యాయి. ఈ నెల ఏడో తేదిన తన భార్యతో కలిసి వెంకటరావు విశాఖపట్నం వెళ్లారు. ఈ నెల 9న అర్ధరాత్రి సుమారు 12 గంటలకు పక్కింట్లో ఉంటోన్న పోరాడు శేఖర్ ఫోన్ చేసి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నట్లు వెంకటరావుకు తెలియజేశారు. వెంటనే ఇంటికి చేరుకున్న వెంకటరావు బీరువా తనిఖీ చేయగా, అందులో ఏడు గ్రాముల బంగారు వస్తువులు, రూ.37 వేలు నగదు చోరీ అయినట్లు గుర్తించారు. దీంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

పట్టించుకోని అధికారులు

రోడ్డుపైనే పోగుపడిన చెత్త

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నగర పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. డివిజన్ కేంద్రమైన పాలకొండలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. సబ్ కలెక్టర్ ఇక్కడ ఉన్నప్పటికీ ఆ స్థాయిలో నగర పంచాయతీ అభివృద్ధి లేదనే చెప్పొచ్చు. 2013లో మేజర్ పంచాయతీ.. నగర పంచాయతీగా మారుస్తూ ఉత్తర్వులు వచ్చాయి. అయినప్పటికీ గ్రామ పంచాయతీ స్థాయి కంటే దిగువన సౌకర్యాలు ఉన్నాయి.

పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులు ఉండగా, 353 వీధులు ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారడంతో పలు వీధులతోపాటు ప్రధాన రహదారుల్లో కంపుకొడుతోంది. రోడ్లపైనే చెత్త దర్శనమిస్తుంది. లుంబురు వారి జంక్షన్, కోమటపేట జంక్షన్, ఎంపిడిఒ కార్యాలయం ముందు, వెంకట్రాం కోనేరు దగ్గర ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతాల్లో రోడ్లపైనే చెత్తకుప్పలు దర్శమిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో కూడా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. చివరికి పెంటకుప్పలకు నిప్పు పెట్టి కాల్చుకునే పరిస్థితి దాపురించింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కమిషనర్ ఎక్కడ?

నగర పంచాయతీ అధికారులు పారిశుధ్యాన్ని పట్టించుకునే పరిస్థితి లేదు. పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ తీసుకోవడం లేదు. నగర పంచాయతీ కమిషనర్ కూడా ఎక్కడా పర్యటించిన దాఖలు కనిపించడం లేదు. గారమ్మ కాలనీవాసులు పూర్తిగా పారిశుధ్యం అధ్వానంగా ఉందని చెప్పినప్పటికీ దృష్టి పెట్టక పోవడం గమనార్హం.

ఫిర్యాదులకు సత్వర న్యాయం

ఎస్‌పి మాధవ్ రెడ్డి

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పిజిఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు సత్వర న్యాయం చేకూర్చాలని ఎస్‌పి ఎస్.వి.మాధవ్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు అర్జీలు అందించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఎస్ఐ రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచె తొలగించాలని వినతి

ప్రజాశక్తి-బలిజిపేట

బలిజిపేటలో మెట్టకాలనీలో రాయిమెట్టపై ఏర్పాటు చేసిన కంచెను తొలగించాలని సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, నాయకులు బి.భానుమూర్తి, వై.మన్మథరావు డిమాండ్‌చేశారు. సోమవారం బలిజిపేటలో తహశీల్దార్ కార్యాలయ సమీపంలోని మెట్ట కాలనీలో ఆక్రమించి ప్రభుత్వ మెట్ట చుట్టూ ఏర్పాటుచేసిన కంచెను, ఇళ్ల స్థలాలను వారు పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్ట కాలనీలో సర్వే నంబర్ 32/2లో కొంతమంది ప్రభుత్వ భూమి రాయి మెట్ట చుట్టూ కంచెవేశారని తెలిపారు. గతంలో ఈ మెట్టపై మంచినీటి ట్యాంకు కట్టాలని అప్పటి రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారని గుర్తుచేశారు. కానీ మెట్ట కాలనీలో యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజావసరాల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ మెట్ట భూమిని కొంతమంది స్వార్థపరులు కాసులకు కక్కుర్తి పడి ఆక్రమించడం దారుణమన్నారు. ఆక్రమణలు తొలగించి, ప్రభుత్వ భూములను రక్షించాలని అడుగుతున్న వారిపై దౌర్జన్యాలకి బెదిరింపులకు దిగడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మెట్ట కాలనీలో కొంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, వారికి వెళ్లడానికి తోవ లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొంతమంది ముళ్లకంచెలు వేసి అడ్డుకుంటున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వ భూముల్లో ఏర్పాటుచేసిన కంచెను, ప్రహరీని తొలగించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెట్ట కాలనీ ప్రజలు పాల్గొన్నారు.


వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటకు చెందిన పత్తిక అశ్వినికుమారికి రూ.43,119 సిఎం సహాయనిధి చెక్కును సోమవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, మాజీ ఎంపిటిసి మండంగి ప్రసాదరావు, నాయకులు తోయక కామేష్, జయంత్, సొనేల రామారావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

శంకరరావు కుటుంబానికి పరామర్శ

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ కన్వీనర్ బిడంకాయల శంకర్రావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. ఎల్విన్‌పేటలోని శంకరరావు సోదరుడు వెంకట్రావు ఇంటికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ కార్యకర్త బిడంకాయల ఆనందరావు, బిజెపి నాయకులు కద్రక అప్పలస్వామి, సీనియర్ నాయకులు ప్రసాద్, శరత్, సొంటేనా రాజేష్, కొనిస మన్మథ, సొనైల రామారావు, సుందరరావు ఉన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

ఎస్‌బిఐ సిఎస్ఆర్ కార్యక్రమాలలో భాగంగా పార్వతీపురం హైస్కూల్‌లో విద్యార్థినులకు 20 సైకిళ్లను అందజేసింది. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ బిబి సాహు సహకారంతో సోమవారం వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ సువేందు శేఖర్ జెనా, మేనేజర్ ప్రవీణ్ కుమార్, పార్వతీపురం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మాధవ్ రంజన్ దత్త, ఎల్‌డిఎం విజయ్‌స్వరూప్, స్కూల్ హెచ్ఎం వరప్రసాద్ పాల్గొన్నారు.

బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లా పరిధిలోని పలు ఆలయాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేశారు. ప్రధాన శివాలయాల వద్ద అదనపు సిబ్బంది నియామకం, క్యూలైన్ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఆలయాల వద్ద గల నదులు, చెరువుల్లో ఎవరూ దిగకుండా ఉండేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బందిని నియమించారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, రైతులు

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి మండల కేంద్రంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతే రాజు రైతే దేశానికి వెన్నెముక అని చెప్పుకుంటున్న పాలకులకు రైతు కష్టాలను తీర్చడంలో, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో చిత్తశుద్ధి కనిపించడం లేదని విమర్శించారు. మండలంలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఇప్పటివరకూ ఖాళీ బస్తాలు గానీ, ఇతర ఏర్పాట్లు గానీ చేయలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

బలిజిపేట : ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని సిపిఎం నాయకులు వై.మన్మథరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ధాన్యం నూర్పులు ప్రారంభమయ్యాయని, ప్రయివేటు వ్యక్తులు, దళారులు, ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు వస్తున్నారని తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించి, రైతులు.. దళారుల బారిన పడకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, మండల నాయకులు బి.భానుమూర్తి పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న కెవిపిఎస్ నాయకులు

అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మించాలని దీక్ష

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మాణం చేపట్టాలని కెవిపిఎస్ ఆధ్వర్యాన సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి ఎన్.సింహాచలం మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో విగ్రహాన్ని తొలగించారని తెలిపారు. పనులు పూర్తయి సుమారు రెండేళ్లు కావస్తున్నా అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారుల తీరు అంబేద్కర్‌ను అవమానపరచడమేనని వ్యాఖ్యానించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మాణం చేపట్టకుంటే పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షకు జెవివి రాష్ట్ర నాయకులు గౌరినాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకులు బి.సిమ్మయ్య, బి.వెంకటి, జి.తవిటయ్య ఆర్.శివ, కె.శివ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -కురుపాం

మాట్లాడుతున్న జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య జోస్పిన్

ప్రతిఒక్కరూ న్యాయ సేవలను వినియోగించుకోవాలని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య జోష్పిన్ అన్నారు. సోమవారం జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా కురుపాం కోర్టులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలు, న్యాయవ్యవస్థపై కక్షదారులకు, ప్రజలకు, పోలీసులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు గ్రామాల్లో పర్యటించి అవగాహన కార్యక్రమాలు సోమవారం నుంచి 16వ తేదీ వరకూ చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, వి.కుమారస్వామి, స్వామి, శ్రీధర్, రాంప్రసాద్, మజ్జి మన్మథరావు, ఎఎస్ఐ నరశింహులు పాల్గొన్నారు.

ఎండలమల్లేశ్వర యాత్రకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి-వీరఘట్టం

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

మండలంలోని కె.ఇచ్ఛాపురం గ్రామంలో సోమవారం ఎండల మల్లేశ్వర స్వామి యాత్రకు యాత్రికులు పోటెత్తారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో మూడో సోమవారం ఇక్కడ ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వీరఘట్టం మండలంతో పాటు వంగర, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, పార్వతీపురం, పాలకొండ, సీతంపేట, తదితర మండలాల నుంచి ఆలయానికి భారీగా జనం తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ జి.కళాధర్ బందోబస్తు చర్యలు చేపట్టారు. బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కూటమి నాయకులు నిమ్మక పాండురంగ, రౌతు దామోదర్ రావు, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ల హరిబాబు, జంపు చంద్రశేఖర్, సుక్క శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు యాత్రికుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.